క్లుప్తంగా

భక్తులకు మజ్జిగ, పండ్ల రసాల పంపిణీ



భక్తులకు పండ్ల రసాలు అందిస్తున్న సంఘం మాజీ అధ్యక్షుడు చినబాబు తదితరులు

అమలాపురం టౌన్: పట్టణ దేవత సుబ్బాలమ్మ తీర్థం సందర్భంగా మంగళవారం స్థానిక మెయిన్ రోడ్డు వద్ద ఆర్య వైశ్య సంఘం నాయకులు చలివేంద్రం ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ, పండ్ల రసాలు అందించారు. పట్టణానికి చెందిన ఆర్య వైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కొల్లూరి చినబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని ఆర్య వైశ్య సంఘం నాయకులు కొల్లూరి సత్యకుమార్, మదన్ సోదరులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు, పట్టణ వైశ్య సంఘం నాయకుడు వంకాయల కాశీ, సంఘ నాయకులు వరదా సూరిబాబు, అప్పన వీరన్న, అంబికా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎస్ మాస్టారుకు సత్కారం



ఏవీఎస్ మాస్టారును సత్కరిస్తున్న కళాసాహితీ సభ్యులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం కళా సాహితీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రవీంద్ర విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పదవీ విరమణ చేసిన ఏవీఎస్ మాస్టారును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్.అబ్బులు, బీవీవీ ప్రసాదరావు, అరిగెల నాగేశ్వరరావు కవితా గానం చేశారు. కార్యక్రమంలో పొత్తూరి లక్ష్మీశ్రీనివాసన్, వడ్డి నాగేశ్వరరావు, గిడ్డి ప్రభాకరరెడ్డి, యలమంచిలి బాలరాజు, పి.భాస్కరవర్మ, జనిపెల్ల సత్యనారాయణ, కాశి వెంకటాచార్య తదితరులు పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో పాఠశాలలకు సెలవు

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 17, 18 తేదీల్లో యానాం, మాహే, పుదుచ్చేరి, కారైకల్ నాలుగు రీజియన్లలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్లు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పి.ప్రియదర్శిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విద్యాశాఖాధికారులకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

ఇంటింటి ప్రచారం

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వి.వైథిలింగానికి మద్దతుగా మంగళవారం యానాం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మల్లాడి సత్తిబాబు ఆధ్వర్యంలో భీమ్‌నగర్, యూకేవీ నగర్, మార్కెట్ వీధి, కనకాలపేట తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మల్లాడి బీరా స్వామి, దున్నా చక్రవర్తి, లంక బంగారం, ప్రసాద్‌రాజు, లంకే శ్రీను, అంజయ్య, వెంకటేశ్వరరావు, మున్నా, గణేష్ తదిరతరులు పాల్గొన్నారు.

తుమ్మలపల్లి, మొగళ్లమూరుల్లో నేడు ఎన్నికల ప్రచారం

అల్లవరం: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం మండలంలోని తుమ్మలపల్లి, మొగళ్లమూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేయనున్నారని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాటన్ విగ్రహానికి ముసుగేల..?



ముసుగు వేసిన కాటన్ విగ్రహం

అమలాపురం టౌన్: సర్ ఆర్థర్ కాటన్ రాజకీయ నేత కాదు.. అలనాటి ఓ బ్రిటీషు అధికారి. కోనసీమకు సాగు నీరు తెచ్చిన అపర భగరీధుడు. అలాంటి చైతన్య మూర్తి విగ్రహానికి ఎన్నికల నిబంధనల్లో భాగంగా అధికారులు ముసుగు వేశారు. అమలాపురం ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ఉన్న కాటన్ పార్కులో కాటన్ విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యమిది.

ఘనంగా ఉగాది వేడుకలు

- అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్త జనం
- భక్తిశ్రద్ధలతో వేదపండితుల పంచాంగ పఠనం



ఉగాది ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు



సుబ్బాలమ్మను దర్శించుకుంటున్న మంత్రి విశ్వరూప్ దంపతులు

అమలాపురం టౌన్: తెలుగువారి తొలి పండగ ఉగాది సందర్భంగా ఇంటింటా సందడి నెలకొంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా షడ్రుచుల మేళవింపుతో కూడిన ఉగాది పచ్చడిని ఆస్వాదించారు. ఉగాది రోజున తొలి దర్శనం చేసుకోవాలన్న తలంపుతో మంగళవారం ఉదయం నుంచే ప్రతిఒక్కరూ ఆలయాలకు వెళ్లి పూజలు, అభిషేకాలు చేశారు. దీంతో ప్రముఖ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేద పండితులు క్రోధి నామ సంవత్సరంలో నవ గ్రహ ఫలితాల ఆధారంగా ఏయే రాశులవారికి ఎలా ఉండనుందో చెబుతూ పంచాంగ పఠనం గావించారు. ఈ ఏడాది వర్షాలు బాగా పడతాయని, పంటలు సమృద్ధిగా పండి రైతులకు మేలు చేకూరుతుందని వివరించారు. పలు ఆలయాల వద్ద భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం, అమ్మవారి తీర్థం మంగళవారం వైభవంగా జరిగాయి. ఉగాది పర్వదినాన అమ్మ దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ఉగాదికి తొలి దర్శనంగా బారులు తీరి మరీ అమ్మ దర్శనం చేసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ అమ్మ వారి దేవస్థానం వద్ద ఉగాది తీర్థం సాగింది. పట్టణం నుంచే కాకుండా పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు తీర్థానికి వచ్చి అమ్మ దర్శనం చేసుకున్నారు. వేసవి నేపథ్యంలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు దేవస్థానం ఈవో బొక్కా వీర వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో రామానంద చారిటబుల్ ట్రస్ట్ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనానికి, తీర్థానికి వచ్చిన భక్తులకు దేవస్థానం ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. స్థానిక చంద్ర బ్రదర్స్ వస్త్రాలయం తరఫున భక్తులకు పులిహోర ప్రసాదాన్ని సమకూర్చారు. దేవస్థానం చైర్మన్ బిళ్ల మల్లికార్జునరావు, దేవస్థానం ధర్మకర్తలు, దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు సేవలందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మున్సిపల్ కౌన్సిలర్లు సుబ్బాలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. ఉగాది సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని మామిడి, వేప తోరణాలు, పూల దండలతో అందంగా అలంకరించారు.

సుబ్బాలమ్మను దర్శించుకున్న మంత్రి విశ్వరూప్

ఉగాది పర్వదినం సందర్భంగా అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మ అమ్మవారిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, బేబీ మీనాక్షి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సుబ్బాలమ్మ దేవస్థానం వద్ద జరుగుతున్న ఉగాది ఉత్సవాల్లోనూ మంత్రి దంపతులు పాల్గొన్నారు. మంత్రి విశ్వరూప్ దంపతులకు దేవస్థానం చైర్మన్ బిళ్ల మల్లికార్జునరావు, మున్సిపల్ కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు, మాజీ కౌన్సిలర్ మామిడిపల్లి రాము తదితరులు స్వాగతం పలికారు. పండితులు



అమలాపురం సుబ్బాలమ్మ అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో మందాలమ్మ అమ్మవారు

వారికి ఆశీర్వాదాలు అందించారు. ఉగాది పర్వదినాన పట్టణంలోని ఆలయాల వద్ద ఉండే యాచకులు, అనాథలకు చిందాడగరువు ఎంపీటీసీ సభ్యురాలు మోటూరి కనకదుర్గ, వెంకటేశ్వరరావు దంపతులు మంగళవారం ఆహార పొట్లాలు అందజేశారు. పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మోటూరి కనకదుర్గ దంపతులను పలువురు అభినందించారు. కార్యక్రమాల్లో యేడిద శ్రీను, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పంచాంగ పూజ

అమలాపురం టౌన్: క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల రోడ్డులో లయన్స్ హాలు వద్ద గల 'లోకా స్సమస్తా స్సుఖినో భవంతు' ఆధ్యాత్మిక సేవా సంస్థ భవనంలో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో శ్రీకాశీ అన్నపూర్ణ, విశాలాక్షి, కామధేను సహిత విశ్వేశ్వరస్వామి వారికి ఆరాధన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పంచాంగ పూజ శాస్త్రోక్తంగా చేశారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు, ఆధ్మాత్మిక సంస్థ ప్రతినిధులు లోకేష్, జీటీ రావు, ఝాన్సీ పాల్గొన్నారు.

మురుగులమ్మకు కుంకుమ పూజలు

అమలాపురం రూరల్: మండలంలోని బండారు లంకలో వేంచేసి ఉన్న గ్రామ దేవత గంగాదేవి మురుగులమ్మ ఆలయంలో అమ్మవారికి గ్రామస్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం వేలాది మంది భక్తులు అమ్మ



ప్రత్యేక అలంకరణలో కొండాలమ్మ అమ్మవారు



విశేష అలంకరణలో యానాం వేంకటేశ్వరస్వామివారు

వారిని దర్శించుకుని చీరలు, గాజులు, సారెలతో మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన జగదీష్ చంద్రగణేష్, స్వాతి దంపతులు అమ్మవారికి 108 డజన్ల గాజులు, పట్టు చీర, రవిక, సారెలను సమర్పించారు. గ్రామ పెద్దలు, వస్త్ర మూట వర్తక సంఘం, చేతి వృత్తుల సంఘం, వడ్రంగి మేస్త్రీల సంఘం ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు. బండారులంక వల్లూరివారి పుంతలో నిర్వహించిన ఉగాది ఉత్సవాలకు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సరెళ్ల రామకృష్ణ, జాన గణేష్, పెదపూడి బాబురావు, తొత్తరమూడి సుబ్బారావు, కొరుకూరి వీరబాబు, కొడమంచిలి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: మండలంలోని బోడసకుర్రు శివారు దేవర్లంకలో ఉగాది ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ఉత్సవాలకు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ముఖ్య అతిథిగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఈ కొత్త ఏడాదిలో పంటలు బాగా పండి, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో దొమ్మేటి సురేష్, గుత్తుల రాజు, అంబటి శ్రీను, పలివెల చిట్టి, సాపే ఏడుకొండలు, సాపే నాగరాజు, సాపే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వాడపర్రులో గ్రామ దేవత మందాలమ్మ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మ



అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



పేదలకు ఆహార పొట్లాలు అందిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తాతాజీ తదితరులు



మురుగులమ్మకు 108 డజన్ల గాజులు, పట్టు చీర సమర్పిస్తున్న గణేష్, స్వాతి దంపతులు

వారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థం నిర్వహించి గరగ నృత్యాలతో అమ్మవారికి ఊరేగింపు జరిపారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్న సమారాధన నిర్వహించారు.

కొండాలమ్మ జాతర ప్రారంభం

ముమ్మిడివరం: ముమ్మిడివరం గ్రామ దేవత కొండాలమ్మ జాతర, తీర్థ మహోత్సవాలు ఉగాది సందర్భంగా మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. యానాంకు చెందిన నాగాభట్ల సుబ్రహ్మణ్యశర్మ ఆలయంలో పంచాగ పఠనం గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుగానికి ఆది ఉగాది అన్నారు. ఈ ఏడాది ప్రజలందరికీ శుభం జరుగుతుందని, ప్రజలందరూ అన్యోన్య మైత్రితో మెలుగుతారన్నారు. అనంతరం పఠనకర్తను ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, అర్చకులు యనమండ్ర సుబ్బారావులు ఘనంగా సత్కరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు పంచాంగాలు, ప్రసాద వితరణ చేశారు.

యానాం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వర స్వామివారు మంగళవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు పెద్దింటి రఘురామవినోదాచార్యులు పంచాంగ పఠనం గావించి అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



జనసేన కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పితాని బాలకృష్ణ తదితరులు



జి.వేమవరంలో శెట్టిబలిజ నాయకులకు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పితాని బాలకృష్ణ

ముమ్మిడివరం: మండలంలోని అయినాపురం శివారు చినమెట్టలంకలో బీసీ సామాజిక వర్గానికి చెందిన 80 మంది జనసేన కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పితాని బాలకృష్ణ వారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలు చూసి వైఎస్సార్ సీపీలో చేరామని గుబ్బల నాగేశ్వరరావు, కట్టా నాగబాబు, మట్టపర్తి చినసత్యనారాయణ తదితరులు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ మట్టపర్తి సురేష్, సానబోయిన మల్లిఖార్జునరావు, జక్కంశెట్టి పండు, యల్లమిల్లి లోకేష్, కడలి వెంకటేశ్వరరావు, మట్టపర్తి బుజ్జి, దొమ్మేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాను గుర్తుకే రెండు ఓట్లు వేయండి

ఐ.పోలవరం: రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ ఫ్యాన్ గుర్తుకే రెండు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు పితాని బాలకృష్ణ అన్నారు. మండలంలో పలు గ్రామాల్లోని శెట్టిబలిజ పేటల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఐ.పోలవరం హనుమాన్ సెంటర్, పశువుల్లంక రామాలయం సెంటర్‌లో శెట్టి బలిజ పెద్దలను ఆత్మీయంగా కలసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా జి.వేమవరం గ్రామంలోని శెట్టిబలిజ వీధిలో కడలి సత్యనారాయణ ఆధ్వర్యంలో సుమారు 200 మంది, ఎర్రగరువు గ్రామం నుంచి గంజా రమణ, గంజా శ్రీను, కొప్పిశెట్టి భైరవమూర్తిల ఆధ్వర్యంలో 90 మంది వివిధ పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పితాని బాలకృష్ణ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, ఐ.పోలవరం పీఏసీఎస్ అధ్యక్షుడు విత్తనాల వెంకటేశ్వరావు, దొమ్మేటి వెంకట దుర్గాప్రసాద్, మురమళ్ల ఎంపీటీసీ మట్టపర్తి శివ, జి.వేమవరం పీఏసీఎస్ అధ్యక్షుడు మెండా వెంకన్నబాబు, మందపాటి భైరవస్వామి, మోర్త చిన్నా తదితరులున్నారు.

200 మంది వైఎస్సార్ సీపీలో చేరిక

తాళ్లరేవు: మండల పరిధిలోని సుంకరపాలెం పంచాయతీ చింతాకులవారిపేట గ్రామానికి చెందిన 200 మంది వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పితాని బాలకృష్ణ వారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ ముమ్మిడివరం నియోజకవర్గ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ చింతాకుల రాంబాబు, చింతాకుల సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, ఈశ్వరరావు, అప్పారావు, సత్తిబాబు, బొంతు సత్యనారాయణ, సీహెచ్ లోవరాజు, టి.సాయిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, మండల ప్రధాన కార్యదర్శి బొంతు మోహన్, ఇంజరం సర్పంచ్ ముద్దన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే బాధ్యత ఇరుపార్టీలది

ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మల్లాడి

యానాం: నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలదని పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. మంగళవారం ఆయన స్వగృహం వద్ద జరిగిన మల్లాడి అభిమానులు, ఎన్ఆర్‌కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యానాంలో సమస్యలను పరిష్కరిస్తారన్న షరతుతోనే ఈ నెల 19న జరిగే పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి నమశ్శివాయంకు మద్దతు తెలిపామని స్పష్టం చేశారు. అవసరమైతే భారత ప్రభుత్వంతో సైతం మాట్లాడి పరిష్కరిస్తామని నమశ్శివాయం హామీ ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11న ముఖ్యమంత్రి రంగసామి, కూటమి అభ్యర్థి నమశ్శివాయం, పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ యానాం విచ్చేస్తున్నారని, ఆ రోజు జరిగే బైక్ ర్యాలీలో కార్యకర్తలంతా అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. అదేవిధంగా నమశ్శివాయంను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

బీజేపీ అభ్యర్థుల ఇళ్లను సోదా చేయాలి

యానాం: పుదుచ్చేరి, తమిళనాడుల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థుల ఇళ్లను అధికారులు సోదా చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఐ.ముదరసన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఉజవకరై నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి వి.వైథిలింగంకు మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించారు. తమిళనాడులో ముఖ్యమంత్రి స్టాలిన్ గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేశారని, అదేవిధంగా పుదుచ్చేరికి రాష్ట్ర హోదాను సైతం తీసుకొస్తారన్నారు. దేశాన్ని రక్షించుకోవడానికి ప్రజలు ఇండియా కూటమికి మద్దతివ్వాలన్నారు. పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న డ్రగ్స్ సంస్కృతిని కూకటి వేళ్లతో పెకిలించేందుకు పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉగాది పురస్కారాల అందజేత

అమలాపురం రూరల్: కోనసీమ గౌడ సేవా సంఘం ఆధ్వర్యంలో కామనగరువులో సర్దార్ పాపన్న గౌడ్ కల్యాణ మండపంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకల సందర్భంగా వివిధ రంగాల్లో కృషి చేసిన గౌడ సంఘీయులను ఉగాది పురస్కారాలతో సత్కరించారు. కోనసీమ గౌడ సేవా సంఘం అధ్యక్షుడు రాజులపూడి వెంకటేశ్వరరావు(భీముడు) అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరిన సాయిరామ్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దాసరి వెంకటరమణ, డాక్టర్ వెలిగోట్ల వెంకటేష్, ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ, రిటైర్డ్ డీఎస్పీ నిచ్చెనకోళ్ల సుదర్శనరావులను ఉగాది పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి మట్ట సత్తిబాబు, దాసరి చిన్నా, వంకా శ్రీనివాసరావు, రాజులపూడి సత్యనారాయణ, కామన గంగాధరరావు, దాసరి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు మల్లాడి ఇఫ్తార్ విందు

యానాం: పవిత్ర రంజాన్‌ను పురస్కరించుకుని పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు యానాంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును మంగళవారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత జామియా మసీదు, వెంకట్‌నగర్‌లో మసీదా కూబాలో సైతం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం మసీదు కమిటీ ఆధ్వర్యంలో మల్లాడిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు ఎస్‌కేఎం జిలానీ, వైస్ ప్రెసిడెంట్ ఎండీ కరీమ్, సెక్రటరీ సుభానీ, సహాయ కార్యదర్శి ఎండీ గౌస్ మొహుద్దీన్, ట్రెజరర్ జిలానీ తదితరులు పాల్గొన్నారు.

పట్టణానికి పెరుగుతున్న ప్రాధాన్యం

- అమలాపురంలోనే ఇంటర్, పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనాలు
- జిల్లా కేంద్రమయ్యాక ఒక్కొక్కటిగా అడుగులు



ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకనం జరిగిన అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

అమలాపురం టౌన్: రెండేళ్ల క్రితం వరకూ అమలాపురం ఓ మున్సిపాలిటీ. అమలాపురం డివిజన్(కోనసీమ)కు కేంద్రం. జిల్లాల పునర్విభజన అయ్యాక అమలాపురం జిల్లా కేంద్రం కావడంతో జిల్లా స్థాయి కార్యకలాపాలు క్రమేపీ ఇక్కడే జరుగుతుండడంతో పట్టణానికి ప్రభుత్వపరంగా ప్రాధాన్యత పెరుగుతోంది. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల ఏర్పాటుతో పాటు జిల్లా స్థాయి సమావేశాలు, సమీక్షలు జరుగుతుండడంతో సహజంగానే జిల్లాలోని ప్రధాన శాఖల అధికారులు, సిబ్బంది ఇక్కడే ఉంటున్నారు. మరోవైపు ఇప్పటికే జిల్లా కేంద్రం కావడంతో పట్టణానికి బైపాస్ రోడ్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇంకోవైపు పోటీ పరీక్షలకు పట్టణం ప్రధాన కేంద్ర బిందువు అయ్యేందుకు అడుగులు పడుతున్నాయి. విద్య, వైద్యం విషయాల్లో జిల్లా ఏర్పాటు కాకముందు ఇతర జిల్లాలకు లేదా ఉమ్మడి తూర్పుగోదావరిలో ఉన్న రాజమహేంద్రవరం, కాకినాడ నగరాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. అలాంటిది ఇప్పుడు వైద్య, విద్య పరంగా ఇక్కడే వనరులు సమకూరుతున్నాయి. అమలాపురం సమీపంలో ప్రభుత్వం రూ.450 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి బోధనా ఆస్పత్రిగా హోదా పెరుగుతోంది. ప్రస్తుతం వంద పడకల ఆస్పత్రిగా ఉన్న కోనసీమ పెద్దాసుపత్రి అయిన ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి 650 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చెందనుందంటే అది జిల్లా కేంద్రం కావడం వల్ల వచ్చిన హోదాగా చెప్పొచ్చు. జిల్లా అభివృద్ధికి ఇవన్నీ స్వాగతించే అంశాలేనని పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమలాపురంలో మూల్యాంకనం

ఇంటర్మీడియెట్ పరీక్షల జవాబు పత్రాలు, పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ ఈ ఏడాది నుంచి అమలాపురంలోనే నిర్వహిస్తున్నారు. ఇతర జిల్లాలకు చెందిన మూడు లక్షలకు పైగా పరీక్షా జవాబు పత్రాలు జంబ్లింగ్ పద్ధతుల్లో ఇంటర్మీడియెట్, పదో తరగతికి సంబంధించి ఇక్కడ దిద్దడం అమలాపురానికి పెరిగిన హోదాతోనే సాధ్యమైందని విద్యావేత్తలు చెబుతున్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీయెట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి మూల్యాంకనాలకు కేంద్రాలుగా నిలిచాయి. ఈ రెండింటి మూల్యాంకన కేంద్రాలకు క్యాంపు ఇన్‌చార్జులుగా జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి(డీఐఈవో), జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో)లు వ్యవహరిస్తున్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనానికి అమలాపురంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వేదిక కావడం గర్వంగా ఉందని ప్రిన్సిపాల్ కవల కోటిలింగం అన్నారు. జిల్లా కేంద్రం కావడం వల్లే అమలాపురంలోని తమ కళాశాలకు ఆ హోదా లభించిందని చెప్పారు.